క్లుప్తంగా

రూ.10వేల ఆర్థికసాయం

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఇటీవల తండ్రీ, కొడుకులు కర్నె కురుమయ్య, శివయ్యలు మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, ఖాదర్‌పాషా, కర్నెవాసు, గోపాలమల్లయ్య, రాముడుయాదవ్, రాంచందర్‌యాదవ్, అమ్మన్ననాయుడు తదితరులున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

బల్మూర్: అంగన్‌వాడీ టీచర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీడబ్ల్యూఓ వెంకటలక్ష్మి హెచ్చరించారు. గురువారం మండలంలోని పోలిశెట్టిపల్లి సెక్టార్ రైతు వేదికలో బల్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను కేంద్రంలో చేర్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనన్నారు. సీడీపీఓ లక్ష్మి, ప్రాజెక్టు పరిధిలోని లింగాల, బల్మూర్, ఉప్పునుంతల మండలాలకు చెందిన టీచర్లు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో గురువారం నర్సరీని డీపీఓ కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు అవసరమైన పండ్లు, పూలమొక్కలను పెంచాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పల్లె ప్రకృతివనం, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్‌నాయక్ పాల్గొన్నారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు

కొల్లాపూర్ : వానాకాలంలో సాగుచేసిన వరి పంటపై రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక అన్నారు. గురువారం మండలంలోని ఎల్లూరులో మండల వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించారు. వరికి సుడిదోమ సోకినట్లు గుర్తించామని పేర్కొన్నారు. దీని నివారణకు పురుగు మందులు ఎలా పిచికారి చేయాలో వివరించారు. కార్యకమంలో చింతల అంజనేయులు, ఈశ్వరయ్య, నక్కబాలస్వామి, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలపై అవగాహన

బిజినేపల్లి: నాణ్యమైన విత్తనాలు నాటితే పంటలు అధిక దిగుబడి వస్తుందని పాలెం కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ జ్యోత్స్న అన్నారు. గురువారం పాలెం కేవీకేలో జాతీయ విత్తన సంస్థ సహకారంతో రైతుల ఉత్పత్తిదారు సంఘాలకు నాణ్యమైన విత్తనంపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేయాలని కోరారు. విత్తనోత్పత్తి పద్ధతులు, వాటి నిర్వహణను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌సీ సంస్థ ప్రతినిధులు, నాగర్‌కర్నూల్ రైతు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బిజినేపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పాలెం కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ జ్యోత్స్న అన్నారు. గురువారం పాలెం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సీజన్ల వారీగా లభించే పండ్లు, కూరగాయల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం దాతలు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బాదేపల్లి సాయిలుగౌడ్ రూ.10 వేలు, మల్లయ్యగౌడ్ రూ.10 వేలు, నరసింహగౌడ్ రూ.5వేలు చొప్పున విరాళాలు అందజేశారు. నాగరాజుగౌడ్, అల్లాజీగౌడ్, వెంకటయ్యగౌడ్, అంజయ్యగౌడ్,ఉపేందర్ ఉన్నారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ అన్నారు. గురువారం గ్రామంలోని లింగమయ్య కాలనీలో ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణను అధిక మెజారిటీతో గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలు మృతి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వర్తించే కార్మికురాలు అలివేల(42) గురువారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందింది. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కార్మిక సంఘం నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. అలివేల కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు.




కల్వకుర్తిలో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు, కొల్లాపూర్‌లో..



వెల్దండలో ..



ఉప్పునుంతల మండలం మర్రిపల్లిలో ..



తాడూరు మండలం యాదిరెడ్డిపల్లిలో..



లింగాలలో



బల్మూర్ కొండనాగులలో

పూజలు.. అన్నదానాలు



నాగర్‌కర్నూల్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



కొల్లాపూర్ మండలం సింగోటంలో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత మహాచండీ దేవీగా దర్శనమిచ్చారు. గోపూజ, అభిషేకాలు, హోమం, మహానీరాజనం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ప్రదోష పూజ లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, పంచ హారతులు, పల్లకీ సేవ డోలోత్సవం నిర్వహించారు. ఆయా మండపాల వద్ద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ఎమ్మెల్సీ, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాలలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు, ఆర్యవైశ్యసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, శ్రీధర్, శ్రీనివాస్, అశోక్, రాఘవేందర్, పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరీ దేవాలయం, భ్రమరాంబ, భక్తమార్కండే శివాలయం, వివిధ మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకున్నారు.

తాడూరు: మండల కేంద్రంలో అమ్మవారు మహాచండి అవతారంలో దర్శనమిచ్చారు. పలు మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యాదిరెడ్డిపల్లిలో యువకులు ప్రత్యేక పూజలు చేశారు.

వెల్దండ: మండలకేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు పలు ఆలయాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలలో అమ్మవారు 5వ రోజు మహాచండిదేవిగా దర్శనమిచ్చారు.

లింగాల: మండల కేంద్రంలో దుర్గామాత మహాచండీ రూపంలో కొలిచారు. లింగాల, అంబట్‌పల్లి, అవుసలికుంట, సూరాపూర్ తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

బల్మూర్: మండలంలోని కొండనాగులలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కొల్లాపూర్: పట్టణంలో దుర్గాదేవిని ధనలక్ష్మి రూపంలో కొలిచారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారిని రూ.50 లక్షల నగదుతో అలంకరించి పూజలు చేశారు. వరిదేలలోని శమీ వృక్షం వద్ద దుర్గాదేవిని రూ.10లక్షల నగదుతో అలంకరించారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో దుర్గామాతను లలితా త్రిపురసుందరీ దేవీ రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టప్రదమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కేదారేశ్వరాలయంలో అన్నదానం చేశారు.

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి



అచ్చంపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చే బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపైనే ఉందని జిల్లా సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని బాలసదన్‌లో ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలను బలోపేతం చేయాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పని చేయాలన్నారు. నవంబర్ నెలలో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ దమయంతి, ఏసీడీపీఓ కమల, విజ్ఞాన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నియమావళి తప్పనిసరిగా పాటించాలి



చారకొండ: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం అంతర్‌జిల్లా సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రూ.50 వేలకు మించి తీసుకెళ్తే జప్తు చేస్తామన్నారు. అనంతరం తనిఖీ చెక్‌పోస్టు రిజిస్టర్‌ను పరిశీలించి, అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఎస్‌ఐ రవి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లింగాల: ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి సమీపంలోని మగ్దూంపూర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేపట్టారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటే



వెల్దండలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటేనని ఆపార్టీలకు ఓటేస్తే అభివృద్ధి కుంటుపడుతోందని ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుర్మిద్దలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి బతుకమ్మ ఆడారు.

భారీగా చేరికలు

మండలంలోని కుర్మిద్ద గ్రామ సర్పంచ్ జ్యోతి, మాజీ సర్పంచ్‌లు దామోదర్‌గౌడ్, శేఖర్ ముదిరాజు, మాజీ ఉప సర్పంచ్ సత్యం, ఆరు మంది వార్డు సభ్యులతోపాటు బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎస్పీ పార్టీల నుంచి 50 మంది కార్యకర్తలు కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి సమక్షంలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్, తోటపల్లి సర్పంచ్ రాజేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, వెంకటయ్యయాదవ్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, జంగయ్యగౌడ్ తదితరులతోపాటు పలువురు పాల్గొన్నారు.

వెల్దండ: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పల్గుతండాలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, పర్వత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, లింగం ముదిరాజ్, దీప్లానాయక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

తెలకపల్లి: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆలేరులో ప్రజా చైతన్యయాత్రలో భాగంగా గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. బొప్పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు హరిచరణ్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ యాదయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరయ్య, ఉమాదేవి, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, శ్రీనివాసులు, గీతారెడ్డి పాల్గొన్నారు.

బిజినేపల్లి: వట్టెం జలాశయం నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన కారుకొండ గ్రామ నిర్వాసిత రైతులకు సరైన సరైన న్యాయం జరగలేదని గ్రామ సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు విష్ణులు అన్నారు. దీంతో వారు గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. త్వరలో నిర్వాసిత గ్రామాలు అయిన వట్టెం, కుమ్మెర, రాంరెడ్డిపల్లి తండా, అనేఖాన్‌పల్లి తండా, పోతిరెడ్డిపల్లి, కొడుపర్తి గ్రామాల నుంచి భారీ వలసలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

చెంచులకు రగ్గుల పంపిణీ

మన్ననూర్: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతం కృష్ణానది పరివాహక ప్రాంతంలోని గీసుగండి చెంచు పెంటలో నివసిస్తున్న 26 చెంచు కుటుంబాలకు రూరల్ ఫౌండేషన్ కొండ చంద్రశేఖర్ ఎన్‌ఆర్‌ఐ సహకారంతో సీనియర్ జర్నలిస్టు చారగొండ బాలకృష్ణ గురువారం రగ్గులు(దుప్పట్లు) అందజేశారు. సుమారు రూ.25 వేల విలువ చేసే రగ్గులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచర్ల శివ, బయ్యన్న, లింగయ్య పాల్గొన్నారు.

ప్రజాపార్టీతోనే బీసీలకు న్యాయం

కొల్లాపూర్: ప్రజాపార్టీతోనే బీసీలకు న్యాయం చేకూరుతుందని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బింగి సాయిలు యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలో ప్రజాపార్టీ మేనిఫెస్టోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 70 శాతానికిపైగా అసెంబ్లీ స్థానాలు ప్రజాపార్టీ కేటాయించిందన్నారు. బీసీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన ఏకై క పార్టీ ప్రజాపార్టీదేనన్నారు. పలువురు నాయకులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేతపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో బుధవారం మధ్యాహ్నం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా 19 క్వింటాళ్ల రేషన్ పట్టుబడిన విషయం విధితమే. ఈ మేరకు గురువారం సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ ఫిర్యాదు మేరకు తెల్కపల్లి మండలం లక్నారం గ్రామానికి చెందిన వాహనం డ్రైవర్ మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

ఆన్‌లైన్ మోసం..

ఉప్పునుంతల: మండలంలోని ఈరట్వానిపల్లి తండాకు చెందిన కేతావత్ హరి సైబర్‌నేరానికి గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ అంజయ్య వివరాల ప్రకారం హరి వాట్సాప్‌కు కేవైసీ చేసుకోవాలని ఎస్‌బీఐ బ్యాంకు పేరిట ఒక లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేసి బ్యాంక్‌కు సంబంధించి వివరాలు అందులో పొందుపర్చగానే అతని ఖాతా నుంచి రూ.48 వేలు డెబిట్ అయ్యాయి. దీంతో కంగారుపడి సైబర్‌నేరానికి గురైనట్లు భావించి బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మహిళపై..

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి సమీపంలో గురువారం కాంసానిపల్లి తండాకు చెందిన కాట్రావత్ కమ్లీ అనే మహిళ నిషేధిత సారాను తరలిస్తూ పట్టుబడినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు. ఆమె వద్ద నుంచి ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని లింగాల్ రోడ్డులో ఉన్న అమ్మబాయికి చెందిన కిరాణ దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు గురువారం 10 లిక్కర్ క్వాటర్లను, 10 బీర్లను స్వాధీనం చేసుకొని అమ్మబాయిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వసిరాంనాయక్ తెలిపారు.

వెల్దండ: మండలంలోని గుండాలలో మట్ట లక్ష్మమ్మ వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



తాడూరు: మండలంలోని ఐతోల్‌లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యార రమేష్, కార్యకర్తలు తిరుపతిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఇంటింటి ప్రచారం



కొల్లాపూర్: పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ గగనం శేఖరయ్య పలు కాలనీల్లో ఇంటింటికి తిరిగి మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. కూలీ పనులు చేస్తున్న మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కాటం విష్ణుతేజతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్‌ను గెలిపించాలని బీఎస్పీ నాయకులు నాయకులు ఇంటింటి ప్రచారంలో స్థానికులను కోరారు. బీఎస్పీ గెలిస్తే విద్య, వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివశంకర్, మల్లేష్, శ్రీకాంత్, రాజేష్, మహేష్, సాయికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించుదాం

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించుదామని ఏఐవైఎఫ్ నాయకులు మారేడు శివశంకర్, శ్రీనివాసులు యువతకు పిలుపునిచ్చారు. యుతవ మేలుకో, దేశాన్ని ఏలుకో అన్న నినాదంతో హైదరాబాద్‌లో అక్టోబర్ 29, 30 తేదీలలో నిర్వహించే ఏఐవైఎఫ్ రెండో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు భాస్కర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొల్లాపూర్(పెంట్లవెల్లి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా పతాంజలి యోగా అధ్యక్షుడు అర్జున్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని కొండూరులో యోగా శిక్షణను ఆయన ప్రారంభించాడు. గ్రామంలో విద్యార్థులు, యువకులు, వృద్ధులు, పెద్దలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం యోగా చేస్తే మానసికంగా ధృడంగా ఉంటామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కూడా దూరం అవుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు, యువతకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



కొండూరులో యోగా శిక్షణలో సాధకులు

ఒక్కేసి పువ్వేసి చందమామ..

తాడూరు: మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే సతీమణి మర్రిజమునారాణి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చారు. ఎంపీపీ శ్రీదేవి, మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి ఆమె బొడ్డెమ్మ ఆడారు. మన సంప్రదాయాలను గౌరవించాలని కోరారు. ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రమణ, తిరుపతిరెడ్డి, రమేష్, వెంకట్‌రెడ్డి, గౌరికుమార్, జలీల్, సమ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మర్రిజమునరాణి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను బుద్ధి చెప్పాలి

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలకు వచ్చే ఎన్నికల్లో యువత బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు కోరారు. మండల కేంద్రంలో గురువారం యువతభరోసా కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో వేలమంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీతోనే నిరుద్యోగ నిర్మూలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భీమేష్, తిరుమల్, శేఖర్, శేఖర్‌గౌడ్, లింగస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

నేటి నుంచి బతుకమ్మ పోటీలు

బల్మూర్: మండలంలోని గోదల్‌లో పీజేఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి బతుకమ్మ పోటీలు నిర్వహించనునట్లు నిర్వాహకులు పండుగ జగదీశ్వర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ ఆట, పాట, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటు వేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ ప్రజలను కోరారు. గురువారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, మాచారం, ఎల్మపల్లి, కల్ములోనిపల్లి, జంగిరెడ్డిపల్లి, ఎమిరెడ్డి తదితర గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26వ తేదీన అచ్చంపేటలో నిర్వహించే కేసీఆర్ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వెంకటేశ్వర్లబావి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ప్రచారాన్ని ప్రారంభించారు. రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పద్మ, శ్రీరాంనాయక్, నేనావత్ శ్రీరాం, పెద్దిరాజ్, నాయకులు చెన్నకేశవులు, సుందరయ్య, ధర్మయ్య, బాల్‌నారాయణ, పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరికలు

మన్ననూర్‌లో 10 మంది, వెంకటేశ్వర్లబావి గ్రామంలో నలుగురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.